# తోటలో

## మత్తయి 26:30, 36-46;

## మార్కు 14:26, 32-42; లూకా 22:39-46;

## యోహాను 18:1, 4, 11, పరిశీలన

విమోచనా కథనంలో తోటలు ప్రధానంగా కన్పిస్తాయి. ఏదెను పాపపు తోటగాను (ఆది. 2:8, 17; 3); గెత్సేమనే, ఆవేదన తోటగాను (యోహాను 18:1; మత్తయి 26:36); ప్రభువు మృతదేహము పాతిపెట్టబడి, ఆయన పునరుత్థానుడైన పేరు తెలియని తోట, నిరీక్షణా తోటగాను (యోహాను 19:41, 42; 20); మరియు పరదైసు,[1] బహుమానపు తోటగాను (ప్రకటన 2:7 చూడు) మనం కనుగొంటాం. మన ప్రసంగం ప్రస్తుతం వీటిలో రెండవ దానిమీద: గెత్సేమనే తోట.

గెత్సేమనేలో ప్రభువైన యేసును గూర్చి మనం చదివితే, మనం నిలిచియున్న భూమి పవిత్రమైనదనే భావం మనస్సులో నాటుకొని కాళ్ళ నుండి చెప్పులు విడిచేలా చేస్తుంది (నిర్గమ. 3:5 చూడు). నా మనోభావాలను D. W. Ford తెలిపాడు:

> ఈ ప్రసంగం చేసేది నేనేనా అని నాకు సందేహం వస్తుంది. సువార్త రికార్డు అంతటిలో బహుగా మనస్సు కరిగించే దృశ్యాన్ని చిత్రించడానికి మాటల నేర్పు, ఆత్మ సంబంధమైన వివేచన, లేక దైవతత్వశాస్త్రం యొక్క మెలకువలు నేను కలిగియున్నాననేది నా సందేహం ... అయితే నేను చేయకలిగిందేమి? యేసు అనే నరునికి బహు దగ్గరకు వచ్చేది యిక్కడే, మరెక్కడా కాదు. నేను గెత్సేమనేని విడచిపెట్టానంటే, యేసు ఏమైయున్నాడో దానిని కనుపరచుటలో నేను తప్పిపోతాను.[2]

యేసును తోటలో మనము తిలకించినప్పుడు, సువార్త రికార్డులో అరుదుగా బయలుపరచబడిన ఆయనలోని ఒక పార్శ్వాన్ని మనం చూస్తాం: భంగపరచబడిన ఆయన మానవత్వం.[3] ఆయన సంపూర్ణమైన దేవుడైయున్నాడు, కాని ఆయన సంపూర్ణనమైన నరుడు కూడ. నరావతారాన్ని గూర్చి మనం తూచి చూడలేనిదెంతో ఉంది;[4] అయితే, క్రీస్తు దేవత్వానికిని ఆయన మానవత్వానికిని మధ్య అప్పుడప్పుడు తీవ్రమైన ఘర్షణ కలిగి ఉండవచ్చు. ఈ తోటలోకన్న యిక ఎక్కడను ఆ ఘర్షణ అంత తేటగా లేదు. “ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనమని” ఆయన తన శిష్యులతో చెప్పినప్పుడు (మత్తయి 26:41), ఆయన కేవలం వారిని గూర్చి మాటలాడలేదు. ఆయన తనను గూర్చి కూడ మాట్లాడారు.

క్రీస్తు పరలోకం నుండి వచ్చిన విషయాన్ని గూర్చి పౌలు రాస్తూ, “మనుష్యుల పోలికగా పుట్టి ... తన్ను తానే రిక్తునిగా చేసికొనెను” అని తెలిపాడు (ఫిలిప్పీ. 2:7). క్రీస్తు ప్రభువు “కనికరమును నమ్మకమును గల ప్రధానయాజకుడగు నిమిత్తము, అన్ని

విషయములలో ఆయన తన సహోదరుల వంటివాడు కావలసి వచ్చెను” అని హెబ్రీయులకు రచయిత అన్నాడు (హెబ్రీ. 2:17). క్రీస్తు “తన సహోదరులవంటివాడు కావలసివచ్చెను” అనే దాన్ని ఆయన శ్రమలతో హెబ్రీ రచయిత కలిపాడు. ఆయన (క్రీస్తు) “మనవలెనే అన్ని విధముల శోధింప (పరీక్షింప) బడి శ్రమ పొందెను” (2:18 4:15). క్రీస్తు శరీరముతో శ్రమపడింది ఆయన సిలువ మరణంలో మాత్రమే కాదు తోటలో కూడ ఆయన శ్రమపడ్డారు (1 పేతురు 3:18), “శరీరధారియైయున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణము నుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను  సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింప బడెను” (హెబ్రీ. 5:7).

భూమిమీద ఉండగా, క్రీస్తు ఎదుర్కొన్న మహా గొప్ప సంగ్రామము ఆ తోటలోనేయని నేను ఒప్పించబడ్డాను. అరణ్యములో, క్రీస్తు అపవాదితో పోరాడారు (మత్తయి 4:1–11); తోటలోనైతే, ఆయన తనతోనే – తన మానవత్వంతో పోరాడారు. “యేసు తోటలోనికి ప్రవేశించినది మొదలు సిలువపై మరణించినంతవరకు ఆయనలో ఉన్న మానవత్వం ఆధిక్యతలో ఉంది. ఆకారమందు మనుష్యుడుగా కనబడి, ఆయన ఈ శ్రమలన్నిటిని సంపూర్ణమైన నరుడుగానే అనుభవించారు” అని అనిన J. W. McGarveyతో నేను ఏకీభవిస్తున్నాను.[5] ఏదియెలాగున్నా, మనం మిస్టరీలోనికి, భక్తితోకూడిన భయము ఆశ్చర్యమును కలిగియున్న పరిధిలోనికి – ప్రవేశిస్తున్నామని తెలుసుకోవాలి – మౌఢ్యంలోనికి కాదు.[6]

## పోరాట రంగం

మనం తోటలోనికి అడుగు పెట్టుతుండగా,[7] యిది పోరాడే రంగస్థలమని గుర్తించకోరతాను. అది అతిఘనమైనది కాకున్నా, ఒక పెద్ద పోరాటాన్ని చేసారు.

### దుఃఖకరమైన చోటు

ప్రభువు యేసుకు గెత్సేమనే అనేది మొదటిదియు బహు దుఃఖకరమైన చోటునై ఉంది. ఈ సత్యము యొక్క ప్రాముఖ్యతను బట్టి, మిగిలిన అంశాలకంటే, దీనికి ఎక్కువ సమయాన్ని కేటాయించుదాం.[8]

మత్తయి 26:36లో మనం యిలా చదువుతాం, “అంతట యేసు వారితో [అపొస్తలులతో] కూడ గెత్సేమనే చోటికి” వచ్చారు. “గెత్సేమనే” అనే పేరుకు “నూనె గానుగ” అని అర్థం: ఈ సందర్భానికి ఆ పేరు తగినది. తనకొరకు వేచియున్న సంగతులు ఆయనను అణగద్రొక్కినప్పుడు, సిలువయొక్క ఛాయ (నీడ) ఆయనను నలిపివేసిన సమయమది.

ప్రభువువారి వేదనను సువార్త రచయితలు తేటైన మాటలలో వర్ణించారు. “దుఃఖపడుటకును చింతాక్రాంతుడగుటకును మొదలుపెట్టెను” అని మత్తయి అన్నాడు (మత్తయి 26:37); ఆయన “మిగుల విభ్రాంతి నొందుటకును చింతాక్రాంతుడగుటకును ఆరంభించెను” అని మార్కు రాశాడు (మార్కు 14:33). “మరణమగునంతగా నా ప్రాణము

బహు దుఃఖములో మునిగియున్నది" అని ఆయన తన శిష్యులకు తెలిపారు (మత్తయి 26:38). "నా ప్రాణము నలుగగొట్టి నాశనము చేయబడినదైనట్టుంది" (NIV) "దుఃఖముతో నా ప్రాణము పిండబడినట్టుంది" (NLT) "మరణమగునంతగా" అనే ప్రయోగం గొల్గొతాకు చెందింది మాత్రమే కాదు, అది గెత్సేమనేకి చెందింది కూడ. "దుఃఖములో నేను దాదాపుగా చనిపోవుచున్నాను" అని AB అంది.

క్రీస్తు తన శిష్యులను విడిచి ముందుకు వెళ్లి నేలమీద బోర్లపడి: "నా తండ్రీ, సాధ్యమైతే, ఈ గిన్నె నాయొద్దనుండి తొలిగిపోనిమ్ము"[9] (మత్తయి 26:39). తనకొరకు వేచియున్న శరీరసంబంధమైన, ఉద్వేగ సంబంధమైన, ఆత్మసంబంధమైన బాధను "ఈ గిన్నె" సూచిస్తుంది.[10] "మహారోదనముతోను, కన్నీళ్లతోను ఆయన ప్రార్థించినట్టు" హెబ్రీ రచన అంటుంది (హెబ్రీ. 5:7).

లూకా ఆ దృశ్యాన్ని యిలా వర్ణించాడు: "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా 22:44). పస్కా వసంత ఋతువు ఆరంభదినాల్లో వస్తుంది గనుక,[11] రాత్రిగాలి చల్లగా ఉండవచ్చు, చలిగా కూడ ఉండవచ్చు (యోహాను 18:18 చూడు). చెమట ఆ కాలంలో ప్రకృతి సిద్ధంకాదు. ప్రభువు ముఖం నుండి కారుతున్న చెమట బయటనున్న ఉష్ణోగ్రతవలన కాదు, అంతరంగంలోని కలత – ఆవేదన నుండి కలిగింది.

"రక్త బిందువులవలె" అనే ప్రయోగం విషయంలో వ్యాఖ్యాన కర్తలు ఆశ్చర్య పోతున్నారు. తీవ్రమైన చెరసాల ఒత్తిడిక్రింద, నుదుటిపైనున్న రక్తకేశ నాళికలు పగిలిపోయి చెమట గ్రంథులలోనికి కారి, ఆ ద్రవము చర్మము గుండా బయటికి వస్తుంది. ఇది బహు అరుదైన వైద్యపు స్థితి.[12] వైద్యుడైన లూకాకు, యిలా పరిస్థితి వర్ణించడం సాధ్యమే, ప్రభువువారి అంతరంగలో ఏలాటి పోరాటం జరుగుతుందో యిది నొక్కి చెప్పుతుంది: లోతైన గాయం నుండి రక్తము ఉబికి వచ్చినట్టు, చెమట ప్రభువు ముఖం నుండి "అలాగే" భూమిమీదికి చెమట పడింది.

రానున్న మరణాన్ని గూర్చి ఆయన గతంలో చూపిన నెమ్మదికిని, తోటలో ఆయన పడుతున్న వేదనకును సమన్వయం కలిగించడానికి కొందరు రచయితలు తంటాలు పడుతున్నారు. "ఏలాటి ఆందోళనము చెందకుండ ఆయన తన మరణాన్ని[13] గూర్చి మాట్లాడారు" అని వారన్నారు. వ్యక్తిగతంగా, ఏ విధమైన సమస్య యిందులో నాకు కన్పించలేదు. మొదటి సంగతి ఏమంటే, ఆయన గతంలో ప్రకటనలు చేసినప్పుడు, ఏ విధంగా కన్పించారో వినిపించారో మనకు తెలియలేదు. దాఖలు చేయబడిన రికార్డు చూపించేది తప్ప, ఆయన ఎలా ముఖంపెట్టారో, ఎలాటి స్వరాన్ని వినియోగించారో తెలిసికొనే మార్గం మనకు లేదు.[14] రెండవదిగా, "రక్తమాంసాలలో" ప్రభువు ఈ మరణాన్ని సమీపించినందున, నిజమైన పరిస్థితి దగ్గరపడుతుండగా, ఆయన ఉద్వేగం హెచ్చయి ఉంటుందని నేను నమ్ముతున్నాను.

ఉదాహరణకు, నాకు శస్త్ర చికిత్స జరిగిన సమయాన్ని గురించి ఆలోచిస్తున్నా. ఈ చికిత్స జరగడానికి కొన్ని వారాల ముందు, జరుగబోతున్న దానిని గూర్చి నెమ్మదిగాను, సహజంగాను మాట్లాడాను. అయినా, ఆ సమయం వచ్చే సరికి, ఆస్పత్రికి వెళ్లాను.

ఒక్క మాటలో చెప్పాలంటే, నాకుండిన నెమ్మది మెల్లగా ఆవిరైపోయింది. "ఆత్మ సిద్ధమేగాని శరీరము బలహీనమైయున్నది" అనిన ప్రభువు మాటలు నాకు నూతనమైన భావాన్ని ప్రసాదించాయి, "ఇది నిజంగా అవసరమా? ఈ సమస్యను మరో రూపంలో పరిష్కరించ గలము గదా!" అని అనడంలో నాకు ఏ యిబ్బందీలేదు.

ప్రభువు ప్రార్థనలో సూచింపబడిన "పాత్ర" శరీర సంబంధమైన, ఉద్వేగసంబంధమైన, ఆత్మసంబంధమైన శ్రమానుభవమని మనం ముందుగానే గమనించాలి. ఆలాటి శ్రమ ఆయన కొరకు వేచియున్నదని ఒక క్షణంసేపు ఆలోచించు. మొదట, భౌతికమైన శ్రమ ఉంటుంది. తొలి ముప్పైల్లో ఉన్న యువకునికి తన లేత జీవితంలో మరణం సహనీయంగా ఉండకపోవచ్చు. తమ జీవితాన్ని అనేకులు ఆరంభించే వయస్సులో అతడు జీవితాన్ని కోల్పోవలసి వస్తోంది.[15] ఆయన అనుభవించబోయే మరణ విధానం దానికంటె అతి ముఖ్యమైనది: మానవునిచే కల్పించబడిన హింసాత్మకమైన బహు క్రూరమైన పరికరం సిలువ.[16] John Gipson యిలా రాశాడు:

> వీపుపై కొరడా దెబ్బలను నుదిటిపై మొత్తబడిన ముండ్ల మకుటము నుండి తన మోముపై కారెడు రుదిరమును, సైనికులు తన కాళ్లుచేతులలోగుండ దింపిన మేకుల వలన చీల్చబడిన శరీరముతో సిలువవేదన - ఆలస్యమైనదియు హింసతో కూడినదియునైన మరణమైయుంది ...[17]

ఉద్వేగ రూపంలో కూడా క్రీస్తు బాధననుభవించారు. గిప్సన్ యిలా కొనసాగించాడు,:

> తన శత్రువుల అవమానాలు, ఆయన స్నేహితులు విడిచిపారిపోవడం, ఎవరికొరకు ఆయన ప్రయాసపడ్డారో, ఎవరికి ఆయన మేలు చేశారో వారి కృతజ్ఞత లేమిని ఆయన సహించడానికి పిలువబడతారు. యూదా మత నాయకుల వైరుధ్యాన్ని యూదా యొక్క ద్రోహచర్యను, ప్రజలయొక్క చంచలత్వము, మతసంబంధమైన పౌర సంబంధమైన న్యాయం హేళన చేయబడడాన్ని ఆయన ఎదుర్కొంటారు.[18]

క్రీస్తుయొక్క ఉద్వేగసంబంధమైన బాధలో, సిలువతో ముడివేయబడిన అవమానం చేర్చబడుతుంది. "సిలువ బానిసలకు, పరదేశులకు, తిరుగుబాటు దార్లకు, నేరస్తులలో బహు హీనమైన వారికి నిలువచేయబడింది."[19] క్రీస్తు అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించినట్టు హెబ్రీ. 12:2 చెప్పుతుంది. "'మ్రాను మీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది.' క్రీస్తు మనకోసము శాపమై" నట్టు పౌలు తెలిపాడు (గలతీ. 3:13).

ప్రభువు యొక్క అత్యధికమైన బాధ శరీరసంబంధమైనదో, ఉద్వేగ సంబంధమైనదో కాదు, అది ఆత్మసంబంధమైనది. ఇక్కడ మనం జాగ్రత్తగా సాగిపోవాలి. ఎందుకంటే, "మన విమోచనకు సంబంధించిన మర్మము చూడలేని లోతులలో తిరుగుతున్నామని" Donald Miller అన్నాడు.[20] సిలువపై క్రీస్తు అనుభవించిన ఆత్మసంబంధమైన వేదనను గూర్చి మనం మాట్లాడవచ్చు, అయితే దాన్ని మనం సంపూర్ణంగా గ్రహించలేం. మనం చేయగలిగిందంతా, లేఖనాలు ఉపదేశించేవాటిని నొక్కి పలకడం. క్రీస్తు సిలువపై

నిలచినప్పుడు మన దోషమును తనపై వేసికొన్నారు గనుక, మన పాపమునకైన శిక్షను ఆయన అనుభవించారు (యెషయా 53:6; 2 కొరింథీ. 5:21; 1 పేతురు 2:24). పాపము మనలను దేవుని నుండి వేరుచేస్తుంది (యెషయా 59:1, 2), మరియు పాపమునకు కడపటి శిక్ష, "ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమ నుండియు పారదోలబడి, నిత్య నాశనమను దండన పొం"దటం (2 థెస్స. 1:9; 7-9). క్రీస్తు మన దోషమును తనపై వేసికొన్నప్పుడు, ఆయన యొద్ద నుండి తండ్రి తన ముఖం గత్యంతరం లేక తిప్పుకున్నారు (మత్తయి 27:46 చూడు).

పాపరహితుడైన దేవుని కుమారునికి ఈ భౌతికమైన, ఉద్వేగసంబంధమైన, ఆత్మ సంబంధమైన బాధకు మూల్యం ఎంత చెల్లించుకొనవలసి వచ్చిందో నీవు, నేను ఊహించలేం. లోకానికి జీవం కావాలంటే, ఆయన మృతిపొందవలసియుంది. లోకానికి వెలుగు కావాలంటే, ఆయన అంధకారములోనికి దిగవలసివచ్చింది.

తోటలో క్రీస్తు ఎక్కువ ధైర్యాన్ని ప్రదర్శింపవలసి యుండిందని కొందరు రచయితలు అభిప్రాయపడ్డారు. "ఎక్కువైన నెమ్మదితో యితరులు మరణాన్ని ఎదుర్కొన్నారని వారంటారు." ఇక్కడ కనీసం రెండు కామెంట్సు ఉన్నాయి: (1) నిజమైన ధైర్యాన్ని ప్రదర్శించేది భయము లేకపోవుటవలన కాదు, భయము ముంచివేసినా, సరియైనదాన్ని జరిగించడంలోనే. (2) అనేకులు బాధను, మరణాన్ని ఎదుర్కున్నా, ప్రభువు ఎదుర్కొన్నంత వేదనను ఎదుర్కున్నవాడెవడూలేడు. "ఎన్నడూ లేనంత బాధను సహించిన" వారికి గిన్నీస్ బుక్‌లో ఒక రికార్డు[21] భాగముంటే, అందులో మొదట చేర్చబడేది - సిలువ వర్ణనయే.

"వేదనకరమైన స్థితిలో" నిన్ను నీవు ఎప్పుడైనా కనుగొన్నావా? ప్రభువు అక్కడ ఉన్నారు - మరియు ఆయన అర్థం చేసికోగలరు (హెబ్రీ. 4:15).

**ఆశాభంగపు స్థలము**

ప్రభువైన యేసుకు గెత్సేమనే తోట కేవలం వేదనకరమైన స్థలం మాత్రమే కాదు. అది ఆశాభంగపు చోటు కూడ.

రూలు ప్రకారం, క్రీస్తు యొక్క దీర్ఘ ప్రార్థనలు ఒంటరిగా ఉన్నప్పుడు జరిగిపోయాయి (మార్కు 1:35; మత్తయి 14:23). ఏమైనా, ఈ సందర్భంలో, సహవాసపు అవసరతను కనుపరచారు. (శస్త్రచికిత్స యొక్క ఉదాహరణకు తిరిగి వస్తాను: నేను శస్త్ర చికిత్స[22] పొందునప్పుడు నేను ప్రేమించిన ప్రజలు కావాలి నా ఉద్దేశమేమో మీకు అర్థమయ్యిందనుకుంటా). క్రీస్తు తోటలోనికి ప్రవేశించిన తోడనే, ఆయన "పేతురును, యాకోబును, యోహానును వెంటబెట్టుకొని" పోయెను (మార్కు 14:33). "మీరు ఇక్కడ నిలిచి, నాతో కూడ మెలకువగా నుండుడని చెప్పెను" (మత్తయి 26:38బి). వారేమి చేశారు? వారు నిద్రపోయారు. అవును, వారు అలసిపోయారని నాకు తెలుసు - అటు శారీరకంగాను, మానసికంగానూ (యేసు మాటలను అనుసరించితే మార్కు 14:37) అలసిపోయారు. వారింకను ఒక గడియసేపైనను ఆయనతో కూడ మెలకువగా ఉండలేరా?

తోటలో క్రీస్తు నందు నిరాశ పెరుగుతూ ఉంది: ఆయన తన శిష్యులతో సంవత్సరాలు గడిపారు, అయితే వారిలో ఒకడు ఆయనను అప్పగింప రంగం సిద్ధం చేసుకున్నాడు.

రాజ్యము యొక్క ఆత్మసంబంధమైన స్వభావాన్ని గూర్చి సంవత్సరాల తరబడి ఆయన వారికి బోధించారు, అయినా భౌతికమైన ఆయుధములతో దాన్ని నిలబెట్టుకోవలసిన రాజకీయమైన రాజ్యమని పేతురు తలంచుతున్నాడు. నీవు ఎప్పుడైనా ఆలాటి నిరాశతో కూడిన స్థలములో నిలిచియున్నావా? ప్రభువైన యేసు అక్కడ ఉన్నారు – ఆయన అర్థం చేసికోగలరు.

### విడువబడిన స్థలం

ఆ తోట ఒంటరిగా విడువబడిన స్థలం. క్రీస్తు తన స్నేహితుల తోడు వాంఛించి నప్పుడు, వారు నిద్రించారు. చివరికి "శిష్యులందరు ఆయనను విడిచి పోయారు" (మత్తయి 26:56).[23] విడువబడినవాడవుగా నిన్ను నీవు ఎప్పుడైనా కనుగొన్నావా? క్రీస్తు అక్కడ ఉన్నారు, ఆయన అర్థం చేసికోగలరు.

మనం అక్కడ ఆగిపోయినట్టయితే, మన సమయం సరిగా గడిచియుండేదే. మనందరికి మన గెత్సేమనేలు ఉన్నాయి. నిజానికి. మీలో కొందరు నిరాశ, నిస్పృహ లేక విసర్జింపబడుట అనే తోటలో ప్రస్తుతం నిలిచియుండవచ్చు. నీవు ఏస్థితిలో గుండా వెళ్లుతున్నావో ప్రభువు ఎరుగును అని గుర్తించడం ఎంత ప్రాముఖ్యం? ఆయన ఎరిగియుండడం మాత్రమే కాదు, ఆయన దయకలిగి యుంటారు. "మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది మనము మంటివారమని ఆయన జ్ఞాపకము చేసికొనుచున్నాడు" (కీర్తన. 103:14). మన "బలహీనతలను ఆయన ఎరుగును; మనవలె ఆయన అన్ని విషయములలో శోధింపబడినను ఆయన పాపము లేకుండ జీవించారు" (హెబ్రీ. 4:15).

## జయము పొందిన ప్రాంతం

అయినా, ఈ కథ యింకా చాలా ఉంది. గెత్సేమనే సంఘర్షణతో కూడిన ప్రాంతం మాత్రమేగాక, జయము సాధించిన చోటైయున్నది. ప్రభువు యిక్కడ మహాగొప్ప విజయాల్లో ఒక దానిని సాధించారు.

### ప్రార్థన చేసిన స్థలమిది

గెత్సేమనే వ్యతిరేకార్థ పార్శ్వమును చూచినమీదట, యిప్పుడు అనుకూల పార్శ్వమును చూద్దాం. మొదట, యిది ప్రార్థించిన చోటని గమనించుదాం. ప్రభువు ఆ తోటలోనికి ప్రార్థించాలనే ఒక కారణంతో వెళ్లారు. "నేను అక్కడికి వెళ్లి ప్రార్థనచేసి వచ్చువరకు మీరిక్కడ కూర్చుండుడని" ఆయన తన శిష్యులతో చెప్పారు (మత్తయి 26:36). తన జీవితంలోని ప్రధానమైన మైలురాళ్లను దాటేటప్పుడు ప్రార్థించడం ప్రభువుకు వాడుక;[24] ఇక్కడ కూడ ఆయన ఏలాటి మినహాయింపులు చేయలేదు.

ఆయన ప్రార్థించే సమయంలో క్రీస్తు ఈ పదాలను ఎందుకు వినియోగించారో మనకొక అంతరార్థం యివ్వబడింది[25] – "ఆయన, నాయనా, తండ్రీ" అంటున్నారు. ఈ ప్రయోగం సువార్త రచనలలో ఎక్కడా కన్పించదు. "అబ్బా" అనేది అరామి పదం –

అంటే "నాయనా" అని అర్థం. శిశువు నేర్చుకునే తొలి మాటల్లో యిది ఒకటి. ఇంగ్లీషు పిల్లలకు "da-da" లేక "pa-pa"[26] అని నేర్పిస్తారు. "అబ్బా" అనే పదం సన్నిహితత్వము, నమ్మిక, బాంధవ్యం అనేవాటిని గుర్తు చేస్తుంది; అది తండ్రితోగల ఒక ప్రత్యేకమైన బాంధవ్యాన్ని కనుపరచుతుంది.

కేవలం క్రీస్తు ప్రభువు ప్రార్థన చేయడం మాత్రమే కాదు, ప్రార్థించుడని ఆయన తన శిష్యులను కూడ ప్రోత్సహించారు: "ఆ చోటు చేరి ఆయన వారితో – మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు ప్రార్థన చేయుడని" చెప్పెను (లూకా 22:40). ఆయన చనిపోబోతున్నారు గదా, అయినా ఆయన వారిని తనకొరకు ప్రార్థించుడని అడగలేదు, తమకొరకే ప్రార్థించుకొనుడని ఆయన వారికి తెలిపారు. "మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థన చేయుడి; ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీన" ము (మత్తయి 26:41). వారి ఎదుట ఏలాటి శోధనలున్నాయో ఆయనకు తెలుసు; వారు జయించగోరితే వారికి ప్రార్థన అవసరం.

నిరాశ, నిస్పృహ, లేక విసర్జింపబడిన నీ గెత్సేమనేలో, ప్రార్థనా స్థలంగా దానిని మార్చుకో.[27] దేవుని చెంతకు చేరుటలో సహాయం పొందలేనంత గొప్ప సమస్య ఏదీ ఉండదు.

**విధేయతను చూపిన స్థలం**

ప్రార్థించే స్థలముతో పాటు, గెత్సేమనే లోబడిన స్థలమైయుంది. (ఇది కీలక సత్యం). నా "యిష్టము నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటకే పరలోకము నుండి దిగి వచ్చితిని" అని ప్రభువు తెలిపారు (యోహాను 6:38; హెబ్రీ. 10: 7, 9 చూడు). "నీ చిత్తము నెరవేరునుగాక" అని ప్రార్థించుటకు ఆయన తన శిష్యులకు బోధించారు (మత్తయి 6:10). ఇప్పుడు, బాధ్యత తన యిష్టముతో సంఘర్షణ పడుతుండగా, ఆయన తన సొంత ఆదేశానికి లోబడుతున్నారు. "నీ చిత్తమైతే ఈ గిన్నె నాయొద్ద నుండి తొలగించు"మని ప్రార్థించిన తరువాత, "అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని" దానితో ఆయన కలుపుతున్నారు (మత్తయి 26:39).[28]

ప్రార్థన అంటే విన్నవించే అభ్యాసమే కాదు, షరత్తుల అభ్యాసం కూడ అయ్యుంటుందని ఒక వ్యక్తి అన్నాడు.[29] క్రీస్తు ప్రార్థించిన ప్రతిసారి, తన యిష్టము తన తండ్రి చిత్తముతో సన్నిహితమైన సంబంధం కలిగియుంది. "నీ చిత్తమైతే, ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగించుము; అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని" మొదట ప్రార్థించారు (మత్తయి 26:39). "నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనేగాని యిది నాయొద్ద నుండి తొలగిపోవుట సాధ్యముకానియెడల, నీ చిత్తమే సిద్ధించుగాక అని" ఆయన రెండవమారు ప్రార్థించారు (మత్తయి 26:42). "తండ్రి నాకు అనుగ్రహించిన గిన్నెలోనిది నేను త్రాగకుందునా అని" చెప్పగలిగారు (యోహాను 18:11). జన సమూహము ఆయనను బంధించినప్పుడు, తప్పించుకొని పోకుండ ఆయనను బంధించింది త్రాళ్లు కావు, ఆయన తండ్రి చిత్తమే.

ఈసారి నీవు నీ గెత్సేమనేలో ఉన్నప్పుడు, ప్రార్థించడం మానకు. ప్రార్థించేటప్పుడు,

"నా యిష్టము కాదు నీ చిత్తమే సిద్ధించును గాక" అని ప్రార్థించి, – అదే భావన కలిగి యుండు. దేవుని చిత్తానికి లోబరచుకున్న ఏ బరువును భారమైయుండదు.

**బలము పుంజుకున్న స్థలము**

చివరిగా, గెత్సేమనే తోట బలము పుంజుకున్న స్థలమనే విషయం నీ దృష్టికి తేగోరుతున్నాను. "ప్రార్థనలను యాచనలను సమర్పించి....అంగీకరింపబడెను" అని హెబ్రీయుల రచయిత అన్నాడు (హెబ్రీ. 5:7). ఆయన ప్రార్థనలకు ప్రతి ఫలముగా ... "పరలోకము నుండి యొక దూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెను"[30] (లూకా 22:43).

క్రీస్తు ప్రార్థించుట ముగించే సరికి, ఆయన అంతరంగపు పోరాటాలు అంతరించాయి. తన ఎదుటనున్న అతి కఠిన పరీక్షను ఎదుర్కొనడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. "ఇంతకుముందు తాను ఏ గిన్నెనుండి ముడుచు కొంటున్నారో, దానినే యిప్పుడు పట్టుకొనడానికి తన చేతిని చాపారు"[31] (యోహాను 18:11). "తండ్రి చేతి నుండి యివ్వబడేది ఎంత చేదైనా, లోకపు చేతిలోని ఏ తియ్యటి దానికంటెను శ్రేష్ఠమయ్యింది."[32]

అప్పుడాయన తన శిష్యుల యొద్దకు వచ్చి ... "ఇదిగో ఆ గడియ వచ్చియున్నది; మనుష్యకుమారుడు పాపులచేతికి అప్పగింపబడుచున్నాడు; లెండి వెళ్లుదము ..." అని చెప్పారు (మత్తయి 26:45బి–46ఎ). ఆయన పారి పోతాడని తన్ను బంధింపవచ్చినవారు ఎదురు చూచియుండవచ్చు; దానికి బదులు, వారిని కలిసికొనడానికి ఆయన ధైర్యముగా ముందడుగు వేశారు (యోహాను 18:4 చూడు).

ఆ గడియనుండి, "ఆ గుంపులో ఆయన మాత్రమే నెమ్మదిగా ఉన్న వ్యక్తియై ఉన్నారు. మనశ్శాంతి, ప్రశాంతత, హుందాతనముతో ఆ దృశ్యములన్నిటి గుండా ఆయన వెళ్లారు. అదే యుగములలో [వింతయై] ఆశ్చర్యమై నిలిచింది."[33] ఆయన ఆపదలకు గురియైనవాడైనట్టుండక, "జయశాలియైయున్నారు."[34] సంఘర్షణ హోదాలో క్రీస్తు గెలుపొందినవారై యున్నారు.

నీవు నీ గెత్సేమనేలో ఉన్నప్పుడు, బలము కొరకు దేవుని తట్టు తేరిచూడు. నీవు ఎదుర్కొనునట్లు దేవుడు సహాయపడని ఏ సవాలూ లేదు (1 కొరింథీ. 10:13; హెబ్రీ. 13:5).

## ముగింపు

గెత్సేమనేలో ఏమి జరిగిందో వివరించే ముచ్చట ప్రక్కనుంచి, దాన్ని సరిపోవునంతగా వ్యక్త పరచగల మార్గమే లేదు. నిరాశతో, నిస్పృహతో, విడువబడిన చోటు అని మనం ఎరుగగలం. ఈ వాస్తవాలను బట్టి, మనం ఏమి సహించవలసి వస్తుందో అది ప్రభువు ఎరుగునని మనం నేర్చుకున్నాం. అయినా, ఆ తోట, ప్రార్థనకు, లోబరచుకొనుటకు, బలపరచుకొనుటకు స్థలమైయుందని కూడ గుర్తించాం. జయించు మార్గం లోబరచుకొనడం – దేవుని చిత్తానికి లోబరచుకొనడమే మనలో ప్రతి ఒక్కరు ఎదుర్కొనే అతి కష్టమైన పని. మన యిష్టాన్ని దేవుని చిత్తానికి అనుకూలంగా మార్చుకోడం; అయితే

ప్రభువు తన విజయాన్ని సాధించింది ఆలాగుననే. ఆ మార్గంలోనే మనము కూడ మన విజయాన్ని పొందగలం.

మన యిష్టాలను లోబరచడానికి సంబంధించి, క్రైస్తవుడగా మారడంలోను, నమ్మకమైన జీవితం జీవించడంలోను ప్రభువు ఆజ్ఞలకు లోబడ్డావా లేదా అని నిన్ను అడుగవలసియుంది. మారుమనస్సు పొందిన విశ్వాసిగా క్రీస్తులోనికి (ముంచడం) బాప్తిస్మము పొందియున్నావా (మార్కు 16:16; అపొ. 2:38; గలతీ. 3:26, 27)? నీవు అలా చేసియుంటే, ప్రభువు కోరుతున్నట్టు బ్రదుకుతున్నావా? నీవు ఒక వేళ ప్రభువునొద్దకు తిరిగి రావలసియుంటే – యిప్పుడే అలాగు జరిగించు (అపొ. 8:22; యాకోబు 5:16).

2001 వసంత కాలంలో ఓక్లహోమా పట్టణపు ప్రాంతంలో గొప్ప పెను తుఫాను కొట్టింది – ఆ పెను తుఫాను భయంకరంగా రంకెలు వేస్తుండగా, "ప్రభువా, నేను యింకా సిద్ధపడియుండలేదని" ఒకడు కేకలు వేస్తున్నట్టు వార్తా పత్రిక రిపోర్టు యిచ్చింది! నీవు ఏ విపత్తుకైనా సిద్ధపడియున్నావా? సిద్ధపడియుండకపోతే, దాని విషయంలో శ్రద్ధవహించు!

## నోట్సు

గెత్సేమనే పై యిది చక్కగా కూర్చబడిన ప్రసంగం. దుఃఖము, ఒంటరితనము, లోబరచుకొనడం అనే మూడు పాయింట్లతో జాన్ గిబ్‌సన్ ప్రసంగించాడు.[35]

---

సూచనలు

[1]"పరదైసు" అనేది గ్రీకుపద రూపము. "తోట", "పార్కు", లేక "అరణ్యము" అని అర్థమిస్తుంది. అది అనేకసార్లు "ఉద్యానవనమను" భావంతో వినియోగించబడింది (*The Analytical Greek Lexicon* [London: Samuel Bagster & Sons Ltd., 1971], 302). [2]D. W. Cleverley Ford, *Preaching Through the Life of Christ* (Peabody, Mass.: Hendrickson Publications, 1994), 76. [3]ఆయన ఆకలిగొనెను (మత్తయి 4:2; 21:18), ఆయన దప్పిగొనెను (యోహాను 4:7; 19:28) కాని ఈ విధంగా ఆయన మరి ఎక్కడను చిత్రింపబడలేదు. [4]"క్రీస్తు జీవితం, 1" చూడు. [5]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 686-87. [6]ఆలోచనలను రేకెత్తించుటకు ఈ విషయాలను చెప్పాను. [7]ఈ ప్రసంగం గత పాఠం తరువాత చేసిన యెడల పూర్వ చరిత్ర అవరసముండదు. యేసు, ఆయన శిష్యులు తోటకు వెళ్లుటను గూర్చి నీవు కొద్దిగ రివ్యూ చేయాలి. [8]దీన్ని ప్రసంగించునప్పుడు, "మీ వాచ్‌లను చూచి చింతించకండి, త్వరలోనే మిగతా విషయాలను చెప్పి ముగిస్తాను" అని నవ్వుతూ తెలియ చేస్తాను. [9]ఈ ఆలోచన ఆయన మనస్సులోగుండా ముందుగానే వెళ్లింది (యోహాను 12:27, 28 చూడు). [10]"గిన్నెమీద" నోట్సు చూడు.

[11]"క్రీస్తు జీవితం, 1"లోని యూదుల పండుగ దినాలను వివరించు చార్టును చూడు. [12]ఈ స్థితిని హెమట్డ్‌రోస్స్ లేక హెమోహిడ్‌రోసిస్స్ అని అంటారు (William D. Edwards, Wesley J. Gabel, and Floyd E. Hosmer, "On the Physical Death of Jesus Christ," *Journal of the American Medical Association* (21 March 1986): 1456. [13]మత్తయి 16:21; 17:22, 23; 20:17–19. [14]ఆయన చెప్పిందేదో వారికి తేటగా అర్థంకాకపోయినా, గతంలో ప్రభువు చేసిన ప్రకటనలు ఆయన శిష్యులను దుఃఖ భరితులనుగా చేశాయి (మత్తయి 17:22, 23; లూకా 18:31–34). ఆయన తన మరణాన్ని గూర్చి మాట్లాడిన విధానం వారికి దుఃఖం కలిగించియుండవచ్చు (యోహాను 12:27, 28). [15]భూ సంబంధమైన తన "పరిచర్య" భాగాన్ని ఆయన ముగించనున్నారు. [16]"విజయం లేక

దుఃఖం" అనే పాఠములో సిలువను గూర్చిన వివరణను మరియు "క్రీస్తు జీవితం, 7"లో "రోమా సిలువపై ఆరు గంటలు" అనే పాఠమును చూడు. [17]John D. Gipson, "Agony in Gethsemane," *Harding University Lectures* (1988), 155. "అన్నిటిలో అతిశ్రేష్ఠమైన ఈవి" అనే పాఠమును "క్రొత్త నిబంధన క్రైస్తవుడుగానుండుట" అనే రచనలో చూడు. [18]Gipson, 155. [19]Edward, Gabel, and Hosmer, 1458. సిలువ వేయబడడంలో వస్త్రాలు తీసివేయడం కూడ చేర్చబడవచ్చు, చీకటి అవమానంతో సంబంధం కలిగియుంది (యెషయా 20:5; ప్రకటన 16:15; అది. 2:25ను 3:8, 10తో పోల్చిచూడు). [20]Donald G. Miller, *Luke*, Layman's Bible Commentary (Atlanta: John Knox, 1959), 155.

[21]*The Guinness Book of Records.* [22]ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నీకు తోడు కావలసిన అవసరతను నీ వ్యక్తిగతమైన అనుభవంలోనుండి ఒక ఉదాహరణను చెప్పు. [23]ప్రస్తుతానికి ఆయన దేవునిచే విడువబడలేదనుకో. [24]"క్రీస్తు జీవితం, 1"ని చూడు. [25]క్రీస్తు ప్రభువుకు ముందు "అబ్బా" అని దేవుని సంబోధించినట్టు యూదుల రికార్డులో లేదు. ఇది రోమా. 8:15; గలతీ. 4:6ల్లో కూడా కన్పిస్తుంది. [26]నీవు నివసిస్తున్న స్థలాల్లో "తండ్రి" అనే పదానికి బాలురు ఉపయోగించే పదాన్ని తెలుపు. [27]అవసరతలో ప్రార్థన అనే అంశం మీద యింక ఎక్కువగా చెప్పవలసి ఉంది. [28]ఈ ప్రసంగమును చెప్పునప్పుడు లోబడుటను గూర్చి యేసు తెలిపిన అనేక మాటలున్నాయి. యేసు ప్రార్థనను గూర్చి మరి కొన్ని ఆలోచనలకొరకు "నీ చిత్తము సిద్ధించును గాక" అనే ప్రసంగమును "నేను ప్రకటించుటకు నాకు యిష్టమైన ప్రసంగం" అనే పాఠములో ట్రూత్ ఫర్ టుడే ఆంగ్ల సంచికలో చూడు. [29]Rick Atchley, "Rematch in the Garden", Southern Hills church of Christ, Abilene, Texas, 25 March 1984. [30]దేవుడు పాత్రను తొలగించలేదు. దాన్ని సహించునట్లు దేవుడు క్రీస్తును బలపరచాడు.

[31]Gipson, 158. [32]Atchley. [33]H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 204. [34]Ibid. [35]John D. Gipson, "Agony in Gethsemane", *Harding University Lectures* (1988), 154-58.

---

## గెత్సేమనే తోటలో యేసు

ఆ తోటలో క్రీస్తు వేదన యొక్క దృశ్యం బహు భయంకరముగా ఉండింది, గాని అది ఆయనను మనకు మరి సమీపంగా చేస్తుంది. దాన్ని తిలకించిన తరువాత, పరలోకసంబంధమైన జీవి మర్త్య మానవుని ఆకారంలో కనిపించిన ఆయనను గూర్చి ఆలోచించడం అది కేవలం సాధ్యం కాదు, అయితే ఆయన కూడ మర్త్యమానవుడే. ఆయన చేతులలోనికి కాళ్లలోనికి సైనికులు కొట్టే మేకులు బాధిస్తాయి. పిలాతు నివాసానికి వెనుక ప్రభువు వీపుపై సైనికులు వినియోగించే రోమీయుల కొరడా యొక్క చర్మపునారులు రక్తాన్ని–ఎర్రటి రక్తాన్ని కార్చుతాయి. నాజూకులేకుండ చెక్క బడిన కొయ్య సిలువ మోయడానికి ఆయన బలవంతపెట్టబడతారు. అది భారభరితంగా ఉంటుంది, దానిక్రింద ఆయన అణగిపోతారు. ఆయన దౌర్జన్యానికి వొంగిపోలేనంత సూపర్‌మేన్ ఏమి కాదు, ఆయన చంపబడగలడు, క్రూరత్వం మీద నీవు నిఘాపెట్టితే ఆయనను నెమ్మదిగా చంపవచ్చు.

Adapted from *Preaching Through the Life of Christ*,
D. W. Cleverley Ford